## వీర్యం పడదు!

**50 సంవత్సరములు వయసు దాటిన తరువాత పెళ్ళి చేసుకున్నాను. నా భార్యకు 30 సంవత్సరములు. మొదటిరాత్రి గంటసేపు రతి చేసినా వీర్యము పడలేదు. ఇలాగే నెల రోజులవరకు వీర్యము పడలేదు. 36వ రోజున వీర్యము ఒకసారి పడ్డది. నాకు పెళ్ళి అయి ఒక సంవత్సరము అవుతోంది. నెలకు రెండు లేక మూడుసార్లు వీర్యము పడుచున్నది. ఎందుకని ఇలా అవుతోంది? హస్త ప్రయోగం చేస్తే అరగంటకు వీర్యం పడుతోంది.**

**చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక గ్రంథములు చదువుట అలవాటు, యోగాభ్యాసం, జపము, ధ్యానము, ప్రాణాయామం చేయుట అలవాటు. మత్తు పానీయాలు జీవితంలో ఎరగను. రోజూ గంటసేపు సంభోగం చేసిన తరువాత అలసిపోయి, అంగమును బయటికి తీస్తాను, తీసాక కూడా 15 నిముషములు వరకు అంగము అలాగే నిటారుగ నిలబడి ఉంటుంది. వీర్యము మాత్రము పడదు. నాకు వీర్యము ఎందుకు పడదు? త్వరగా వీర్యము పడటానికి మందులు తెలుపగలరు.**

**-బి.ఆర్., సోలాపూర్ (మహారాష్ట్ర)**

జ. ఇట్లా ఎంతోసేపు సంభోగిస్తేగాని హస్తప్రయోగం చేస్తేగాని స్ఖలనం కాకపోవడాన్ని డిలేయెడ్ ఇజాక్యులేషన్ (delayed ejaculation) అంటాం.

దీనికి వయసు, షుగర్ వ్యాధి, ఏవైనా మందులు (ఉదా: మానసిక సమస్యలకి వాడే యాంటీ డిప్రెసెంట్లు మొ॥వి), కొన్ని నరాల దోషాలు ప్రధాన కారణాలు.

అలాగే మానసిక అడ్డంకులు ఉండటం వల్ల కూడా స్ఖలనం లేటవుతుంది. గర్భం వస్తుందేమోననే భయం, భార్య తనకన్నా బాగా చిన్నదని / పెద్దదని ఫీలింగు, ఆమెని తృప్తి పరచాలన్న ఆరాటం- ఇవికూడా కారణం కావచ్చు.

కొందరి అంగాలకి ప్రేరణ అధికంగా అవసరం. వారికి హస్తరతిలో లభించినంత ఉధృతమైన, బిగుతైన ప్రేరణ యోనిలోని మృదువైన స్పర్శవల్ల లభించకపోవడంతో త్వరగా కామస్పందనలు శిఖరాగ్రానికి చేరవు. మీ పరిస్థితి దీనికి దగ్గరగా ఉంది.

మిగతా ఫేక్టర్సేవన్నా కారణమైతే వాటిని ముందుగా తొలగించి, అటుపైన మీరు ఇతర రతి భంగిమలు ట్రై చెయ్యండి.

మీ భార్య తన యోని కండరాలను రతి సమయంలో బిగపట్టడంవల్ల ప్రయోజనం ఉంటుంది. అలాగే ఆ టైంలో ఉద్రేకం కలిగించే మాటలు మాట్లాడు కోవడం, సన్నివేశాలు ఊహించుకోవడం వల్ల కూడా ఉపయోగం ఉంటుంది. ఆమెని తృప్తి పరచాలన్న ఆలోచన ఎక్కువగా ఉంటే

విడిచిపెట్టి, మీ ‘స్వార్థం’ మీరు చూసుకోండి. దానివల్ల త్వరగా స్ఖలన మవుతుంది.

చాలామంది భర్తలు రతి ప్రారంభించిన వెంటనే తీవ్ర ఉద్రేకానికి లోనై స్ఖలించే పరిస్థితికి చేరుకుంటారు. కాని భార్యని సంతోషపెట్టాలి కనుకనూ, తమకే యింకాస్సేపుంటే బావుంటుందనిపించడం వల్లనూ అప్పటికి ఆ ఉద్రేకాన్ని అణిచేసు కుంటారు. ముఖ్యంగా కుర్రాళ్ళ కంటే పెద్దాళ్ళకి ఈ శక్తి బాగా ఉంటుంది. అయితే ఇలా ఒకసారి ఆపుకున్నాక మళ్లీ అంత ఉద్రేకస్థాయికి చేరుకోవడం కష్టమై చాలాసేపు రతి చేసి, యిక లాభం లేదని విడిచేస్తారు.

మీకు అలాంటి అనుభవం ఎదురైతే మీరు కూడా మీ పద్ధతి మార్చుకుని రతిని వేగంగా చేసి, స్ఖలించండి.

రతికీ రతికీ మధ్య దూరం పెరగడం కూడా ఉపయోగ పడుతుంది.